గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు

బిజినేపల్లి : గిరిజనులను అరెస్టు చేసిన పోలీసులు

బిజినేపల్లి, జూన్ 8 : మంత్రివర్గ విస్తరణలో భాగంగా గిరిజన మహిళకు స్థానం కల్పించాలంటూ రాష్ట్ర గిరిజన విద్యార్థి సమితి, లంబాడ హక్కుల పోరాట సమితి ఆదివారం గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. దీంతో గాంధీభవన్‌కు వెళ్లకుండా స్థానిక గిరిజన నాయకులను బిజినేపల్లి పోలీసులు ఆదివారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. గిరిజన మహిళకు మంత్రి పదవి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ఎస్టీ మహిళకు మంత్రి పదవి వచ్చేదాక ఉద్యమం ఆగదన్నారు. అనంతరం సొంత పూచీతో విడుదల చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సమితి జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, మండల ప్రధాన కార్యదర్శి నితిన్‌నాయక్ ఉన్నారు.

లింగాలలో..

లింగాల, జూన్ 8 : మంత్రివర్గ విస్తరణలో గిరిజన మహిళకు స్థానం కల్పించాలని కోరుతు లంబాడ హక్కుల పోరాట సమితి, గిరిజన సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం స్థానిక లంబాడ హక్కుల పోరాట సమితి, గిరిజన సంఘం నాయకులకు పోలీసులు ముందుస్తు అరెస్టు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాలను ఆపలేని, మంత్రి పదవుల్లో చోటు కల్పించే వరకు పోరాడతామని ఆరోపించారు. అనంతరం తమ సొంత పూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బోజ్య, హన్మంతు ఉన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, జూన్ 8 : తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో గిరిజన మహిళకు అవకాశం కల్పించాలని లేదంటే చలో గాంధీభవన్ ముట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర గిరిజన సంఘాలు పిలుపునివ్వడంతో ఆదివారం తెల్లవారు జామునుంచే పట్టణంలోని తెలంగాణ గిరిజన సంఘం, గిరిజన సేవా సంఘం రాష్ట్ర నేతల ఇండ్లకు పోలీసులు చేరుకొని ముందస్తు అరెస్టులు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై సాయంత్రం విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో గిరిజన సేవా సంఘం ఉద్యోగ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపాధ్యాయులు సభవట్ బీచ్యానాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ

లింగాలలో నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

వత్ శంకర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే మృతి తీరనిలోటు

చారకొండ, జూన్ 8 : జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణం తీరనిలోటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, నేతలు రమేశ్, సలీం, రామకృష్ణ, చండీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గోపినాథ్ మృతిపై సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సరిరాంనాయక్, జూమ్లానాయక్, యాదయ్య గౌడ్ పాల్గొన్నారు.

వంగూరులో..

వంగూరు, జూన్ 8 : జూబ్లీ హిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి ఎంతో బాధ కలిగించిందని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్‌రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంతో నిజాయితీగా పేద ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ వారి సంక్షేమానికి పాటుపడే వ్యక్తి గోపినాథ్ పేర్కొన్నారు. అజాతశత్రువుగా పేరు తెచ్చుకుని మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజల మన్ననలు అందుకున్న ఎకైక వ్యక్తి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం నిజాయితీగా పని చేసి ప్రజల గుండెల్లో నిలిచిన ఎమ్మెల్యే గోపినాథ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు.

కరాటే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది

కరాటేలో బెల్ట్ తీసుకున్న వారితో మాస్టర్

లింగాల, జూన్ 8 : ఆత్మరక్షణ మెళకువల కోసం కరాటే నేర్చుకుంటే ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని సీనియర్ బ్లాక్‌బెల్ట్ డాన్ గ్రాండ్ మాస్టర్ కేటీ తిరుపతయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిహెన్ షోడోకాన్ స్టోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ అకాడమి నిర్వహిస్తున్న కరాటే శిక్షణ శిబిరాన్ని సందర్శించి పోటీల్లో మంచి ప్రదర్శన చేసిన వారికి బ్లాక్, ఎల్లో బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే సాధన చేయడంతో విద్యార్థి జీవన నైపుణ్యాలను, జ్ఞానాన్ని, పని తీరును పెంచుతాయని పేర్కొన్నారు. కరాటేలో మంచి ప్రదర్శన కనబ్చిన బాలికల విభాగంలో దీక్షిత, సృజన, హర్షిత, బాలుర విభాగంలో మేదామ్స్, దీపక్‌నందన్, దిలీప్‌కుమార్ మెడల్స్‌లను ప్రదానం చేశారు. కరాటే ప్రదర్శనకు సహకరించిన రాజమనేమ్మ, నూకల శంకర్‌బాబుకు సత్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ ముఖేశ్, వాసవి క్లబ్ మండలాధ్యక్షుడు రామకృష్ణ ఉన్నారు.

కొనసాగుతున్న 'బడిబాట'

తిమ్మాజిపేట : బాడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తిమ్మాజిపేట/అమ్రాబాద్/ఉప్పునుంతల, జూన్ 8 : మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం తిమ్మాజిపేటతోపాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంతోవో సత్యనారాయణశెట్టి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిలలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని, ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. అనుభవం గల ఉపాధ్యాయుల ద్వారా తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో బోధన ఉంటుందన్నారు. అదేవిధంగా అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంతోవో బాలకృష్ణన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సారథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మాచారం గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేవిధంగా తల్లిదండ్రులకు సూచనలు చేశారు. ఐదుగురు కొత్త విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు పొందినట్లు ఎంతోవో తెలిపారు. అలాగే బడీడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఉప్పునుంతల మండలంలోని తాడూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామస్వామి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉప్పునుంతల మండలం తాడూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆక్తర్ ఆలీ, జైపాల్‌రెడ్డి, నిరంజన్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు శ్యామల, శ్రీనివాసులు, వసంతకుమార్, గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేయడానికి రిసెప్షనిస్ట్, హౌస్ కీపింగ్, వార్డు బాయ్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, నర్సింగ్ స్టాఫ్ కావలెను. Cell: 9133211108

NT-MBNR

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

కల్వకుర్తి పశువుల సంత

- ఆదివారం రోజునా విధులు నిర్వహించాల్సిన దుస్థితి
- భారీగా ఆదాయం కోల్పోతున్న కల్వకుర్తి మున్సిపాలిటీ
- టెండర్ ధర ఎక్కువగా ఉండటంతో నిరాసక్తత వ్యక్తం చేస్తున్న గుత్తేదారులు

మున్సిపల్ సిబ్బందికి భారంగా

పశువుల సంత

కల్వకుర్తి, జూన్ 8 : కల్వకుర్తి మున్సిపాలిటీకి భారీ ఆదాయం తీసుకువచ్చే పశువుల సంత మున్సిపల్ సిబ్బందికి భారంగా మారింది, ఆదివారం సెలవు రోజు కూడా సంతలో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది. సంవత్సరానికి రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుస్తున్న పశువుల సంతకు ఈఏడాది 2025-26 సంవత్సరానికి టెండర్లు దక్కించుకోవడానికి గుత్తెదారులు ఎవ్వరు ముందుకురాక పోవడంతో మున్సిపాలిటీ అధికారులే సంత నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెండర్ ప్రారంభ ధర రూ.1.27కోట్లు ఉండడంతో వేలంలో పాల్గొన్న గుత్తెదారులు తమ వల్ల కాదంటూ వెనుతిరిగారు. వారం రోజుల కిందట పది నెలల కాలానికి ప్రారంభ ధర రూ.1.17 కోట్లు నిర్ణయించి టెండర్లు పిలిచారు. గిట్టుబాటు కాదంటూ గుత్తెదారులు వెనుతిరిగారు. దీంతో గత్యంతరంలేని మున్సిపల్ అధికారులు పశువుల సంతను నిర్వహిస్తున్నారు.

టెండర్ ధర పెరగడం..

టెండర్ ధర రూ.1.27 కోట్లకు పెరగడం పశువుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో పశువుల సంత టెండర్‌ను దక్కించుకునేందుకు గుత్తేదారులు ముందుకు రావడంతో లేదు. 2024-25 సంవత్సరంలో 9 నెలల కాలానికి రూ.87 లక్షలకు పశువుల సంతను దక్కించుకున్న కాంట్రాక్టర్ దాదాపు రూ.20 లక్షల వరకు నష్టపోయారు. ప్రతి వారం రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఆదాయం వస్తే సంతలో మిగులుబాటు ఉంటుందని గుత్తెదారులు అంటున్నారు.

ఇప్పుడు కల్వకుర్తి పశువుల సంతలో ఆ పరిస్థితి లేదు. అధికారులు ఇవేమి ఆలోచించకుండా ప్రతి సంవత్సరం 10 శాతం టెండర్ ధర పెంచుకుంటూ పోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని గుత్తెదారులు అంటున్నారు.

టెండర్ ధర తగ్గిస్తే..

టెండర్ ధర తగ్గించాల్సిన అధికారం ఉన్న తాధికారులకు మాత్రమే ఉంది.క్షేత్ర స్థాయిలో పరిస్థితి అర్థం చేసుకోకపోవడం వల్ల టెండర్ ధర ఎక్కువ మొత్తంలో తగ్గడం లేదు.2025-26 సంవత్సరానికి 12 నెలల కాలానికి రూ.1.27 కోట్ల ధర నిర్ణయించి టెండర్‌లు పిలిస్తే గుత్తెదారులు స్పందించలేదు.సరిగ్గా 10 వారాల తర్వాత రూ.1.17 కోట్లకు ప్రారంభ ధర నిర్ణయిస్తూ టెండర్‌లు పిలిచారు. అంటే 10వారాలకు రూ.10లక్షలు మాత్రమే తగ్గించారు. విషయానికి వస్తే పశువుల సంత ఎక్కువగా ఎండాకాలం, బక్రీద్ ముందు వారంలో భాగా నడుస్తుంది.తిరిగి అక్టోబర్ నుంచి డిసెంబర్ మాసాలతో పాటు దసరా, సంక్రాంతి, రంజాన్ పండుగలకు పశువుల సంతలో క్రయ విక్రయాలు జరుగుతాయి.మిగతా వారాల్లో రూ.1లక్ష నుంచి రూ.1.50లక్ష దాటదు.ప్రస్తుత విషయానికి వస్తే బక్రీద్ పండుగ ముందు ఆదివారం రూ.2.9లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఆదివారం 8వ తేది మాత్రం సంతలో పశువులు చాల తక్కువగా ఉన్నాయి. రూ.70 నుంచి రూ.80వేల వరకు మాత్రమే ఆదాయం వచ్చే పరిస్థితి.

సంతలో పశువులు

పాలకమండలి లేకపోవడంతో..

ప్రస్తుతం కల్వకుర్తికి పాలకమండలి లేక పోవడం వల్ల పశువుల సంత విషయమై కమిషనర్ నిర్ణయం తీసుకోలేని పరిస్థితి.అదే పాలకమండలి ఉంటే తీర్మానం చేసి ధర నిర్ణయించేవారు.టెండర్ ధర ఆశాజనకంగా లేక పోతే పశువుల సంతను అధికారులే పూర్తి స్థాయిలో నిర్ణయించాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల మున్సిపాలిటీ చాల వరకు పశువుల సంత నుంచి ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి ఉంటుంది. దీనికి తోడు మున్సిపాలిటీ సిబ్బందికి అదనపు శ్రమ అవుతుంది.ఆదివారాల్లో కూడా విధులు నిర్వహించాల్సి వస్తుంది.

పశువుల సంత వర్సెస్ తైబజార్..

పశువుల సంతకు గుత్తెదారు ఉన్నప్పుడు పశువుల సంతకు పశువులను తీసుకువచ్చే బొలరో, డీసీఎం వాహనాలకు చెందిన రుసుంను(రూ.50) తైబజర్ నిర్వాహకులు తీసుకునేవారు. పశువుల సంతను మున్సిపాలిటీ అధికారులు నిర్వహిస్తున్నప్పటి నుంచి పశువుల సంతో వాహనాలకు ఏలాంటి రుసుంను తైబజార్ గుత్తెదారు తీసుకోవద్దని కమిషనర్ హుకుం జారీ చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది చిన్న పేపర్‌పై స్టాంపు వేసి రూ.50 వసూలు చేశారట. ఈవిషయం బయటకు పొక్కడంతో ఇప్పుడు నేరుగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నారు. సంతకు వచ్చే వాహనాల ద్వారా ప్రతి వారం రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు ఆదాయం ఉంటుందని తైబజార్ నిర్వాహకులు అంటున్నారు. 10వారాలు లెక్కేసుకున్న దాదాపు వాహనాల ద్వారా నూ.1లక్ష వరకు గోల్‌మాల్ అయినట్లేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. సంత నిర్వహణ మున్సిపాలిటీకి భారమవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి సంతకు టెండర్ నిర్వహించి మున్సిపాలిటీకి ఆదాయాన్ని పెంచాలని కల్వకుర్తి వాసులు కోరుతున్నారు.

సగరుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జూన్ 8: సగరుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ సమీపంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద శ్రీవిశ్వక్సేన గోశాల ద్వితీయ సంస్థకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అదేవిధంగా సగర భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. సగరుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వ కృషి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు పురు సగర సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాల్వ నిర్మాణ పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు

తాడూరు, జూన్ 8 : మండల పరిధిలోని తుమ్మలసూగూరు, భలాన్‌పల్లి గ్రామాల మధ్య కెనాల్ కాల్వపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పరిశీలించారు. భలాన్‌పల్లి గ్రామ రైతులు తమ వ్యవసాయ పొలాలకు నీళ్లు కావాలని, బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న వద్ద పైపులు వేయాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డిని కోరగా స్పందించిన ఎమ్మెల్యే పైపులు వేసి భలాన్‌పల్లి గ్రామ రైతులకు నీరందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, ధర్మయ్య, మల్లేశ్, మందీప్, మల్లేశ్, ఆంజనేయులు, పరమేశ్ పాల్గొన్నారు.

మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంబికొండ గీత

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి గీత

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 8 : సమాజంలో మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాలని, సమాజంలో అనేక మార్పులు చెందుతున్నప్పటికీ టెక్నాలజి పెరుగుతున్నప్పటికీ కూడా మహిళలపై హింసపై ఎప్పటికప్పుడు దేశంలో, రాష్ట్రంలో జిల్లాల్లో జరుగుతున్నాయి. ఈ అఘాయిత్యాలపై ఐద్వా గలమెత్తి ప్రశ్నిస్తూ ఉందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి గీత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోదీ సర్కార్ అధికారంలోకి రాకముందు నల్లధనాన్ని తీసుకువచ్చి నిరుపేదల అకౌంట్లలో రూ.15లక్షలు వేసి నల్లధనాన్ని అంతా తెల్లగా మారుస్తానని హామీ ఇస్తే మొట్ట మొదటగా సంతోషపడ్డది మహిళలే అని ఇకపై మన భారతదేశంలో నిరుద్యోగ సమస్యనే ఉండదని, అలాగే వైద్యానికి ఎలాంటి లోటు ఉండదని హామీలు ఇచ్చినప్పుడు భారతదేశ భవిష్యత్తు మారి పోతుందని ఎదురు చూస్తున్నా ఎంతో మంది కలలను కాలరాస్తూ మహిళ కార్మికుల హక్కులను ఇలా ఎక్కడికక్కడ అణిచివేత్తకు గురి చేస్తూ ప్రజలను అయోమయంలోకి నెట్టుస్తుండడం మన కల్లముందు కనబడుతుందన్నారు. రానున్న రోజుల్లో ఐద్వా మహిళా సంఘం మహిళ హక్కులపై ఉద్యమించాలని మహిళకు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఉపాధ్యక్షుడు ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శి శివలీల, జిల్లా కమిటీ సభ్యులు చెన్నమ్మ, సైదమ్మ, ఈశ్వరమ్మ ఉన్నారు.

సీఈసీలో మిగిలిన సీట్ల భర్తీ

కల్వకుర్తి, జూన్ 8 : కల్వకుర్తి పట్టణంలోని దేవర కొండ రోడ్డులోని సీబీఎం కళాశాల ఎదురుగా ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన సీఈసీ గ్రూప్‌లో మిగిలిన సీట్లను ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పార్వతమ్మ ఆదివారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎస్టీ కులానికి చెందిన బాలికలు స్పాట్ అడ్మిషన్‌కు అర్హులని ప్రిన్సిపాల్ చెప్పారు. స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థినులు తమ ఓరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నాగర్‌కర్నూల్, జూన్ 8: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో తేలికపాటిగా మరి కొన్ని మండలాల్లో మోస్తరుగా వర్షం కురవడంతో రైతులకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. ఇటీవల వరుసగా వర్షాలు కురవడంతో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు సాగు శ్రీకారం చుట్టారు. విత్తనాలు మొలకెత్తే సమయంలో వర్షాలు లేక పోవడంతో ఎండిపోతాయని ఆశిస్తున్న క్రమంలో ఆదివారం నాటి వర్షం కాస్త ఊరటనిచ్చింది.

వంగూరు : ఉమ్మాపూర్‌లో కురుస్తున్న వర్షం

చారకొండలో..

చారకొండ, జూన్ 8 : మండల కేంద్రంతో పాటు మర్రిపల్లి, సిరుసనగండ్ల, శాంతి గుట్టెం, తుర్కలపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. కొన్ని రోజులుగా తీవ్రంగా ఎండలు ఉండడంతో ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మండలంలో వర్షం రావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.

వంగూరులో..

వంగూరు, జూన్ 8 : మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తమ పొలాల్లో పంటలను సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఆదివారం కురిసిన భారీ వర్షంతో రైతులు తమ పొలాల్లో సాగు మొదలు పెట్టారు. మండలంలో మొత్తం రైతులు వానకాలంలో వాణిజ్య పంటలు సాగు చేస్తారు. అందులో భాగంగా తెల్ల బంగారమైన పత్తిని సాగు చేసేందుకు రైతులు అన్ని సిద్ధం చేసుకున్నారు. కొంత మంది రైతులు ఆదివారం పత్తి విత్తనాలు నాటడం ప్రారంభించారు. మండలంలో మొత్తం 28వేల ఎకరాలు సాగు పొలం ఉండగా అందులో 16వేల ఎకరాలు పత్తిని రైతులు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పిడుగుపాటుకు గెదేలు మృతి

చారకొండ, జూన్ 8 : ఈదురుగాలులు, మెరుపులతో కురిసిన వర్షంతో పిడుగుపాటుకు నాలుగు గెదేలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. మండలంలోని సిరుసనగండ్లలో జటమోని అంజయ్యకు చెందిన రెండు గెదేలు మృతి చెందాయి. బాధిత రైతు అంజయ్య తన వ్యవసాయ పొలంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చి తిరిగి సాయంత్రం పాలు పితికేందుకు వెళ్లగా అప్పటికే పిడుగుపాటుతో రెండు గెదేలు అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదేవిధంగా బిజినేపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన క్యామ శ్రీశైలం మాదిరిగానే తన పంట పొలంలో పనులు ముగించుకొని అక్కడే చెట్టుకు తన రెండు ఎద్దులకు కట్టేసి ఉంచాడు. ఈక్రమంలో మధ్యాహ్నం సమయంలో ఉరుములు మెరుపులతో వర్షం కురుస్తూ పిడుగుపడడంతో చెట్టుకింద ఉన్న రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సుమారు రెండు కాడెద్దుల విలువ రూ.1.50లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బిజినేపల్లి : పిడుగుపాటుకు మృతి చెందిన కాడెద్దులు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 8 : దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కనీస వేతనాల అమలు తదితర సమస్యల పరిష్కారం కోసం జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11ఏళ్ల కాలంలో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను విచ్ఛిన్నం చేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాశారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, పర్వతాలు, రామయ్య, శివరాములు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సఫారీ టూర్‌లో చిరుత ప్రత్యక్షం

అమ్రాబాద్ జూన్ 8 : నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో మండలంలోని ఫర్హాబాద్ నుంచి మొదలైన సఫారీ యాత్రలో యాత్రికులకు చెట్లల్లో ఆదివారం చిరుత కనిపించింది. సఫారీలో భాగంగా అడవిలో యాత్రికులకు చిరుత కన్పించడంతో యాత్రికులు సంతోషం వ్యక్తం చేశారు. ఏటీఆర్‌లో సఫారి యాత్రికులకు వన్యప్రాణులు కన్పించడంతో సఫారీ యాత్రకు జంతు ప్రేమికులు మక్కువ చూపిస్తున్నట్లు ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్ గోపిడి పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 8 : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని రామకృష్ణ టాకీస్ రోడ్డులో గల శోభ ఆప్టికల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి క్యాటరాక్ట్ పొరగల వారిని ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్స్ రాంరెడ్డి కంటి దవాఖానకు ఎనుగొండ మహబూబ్‌నగర్‌కు పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వ దవాఖానలో ఉచితంగా రక్త పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే ముందు ఆధార్‌కార్డు, ఓటర్ కార్డు లేదా రేషన్ కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. వివరాలకు 9440454284కు సంప్రదించాలని కోరారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొల్లాపూర్ రూరల్, జూన్ 8 : కొల్లాపూర్ పట్టణంలోని గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదోతరగ